క్లుప్తంగా

రేపటి నుంచి నీలమ్మతల్లి ఉత్సవాలు


సామర్లకోటలో ఉన్న నీలమ్మ అమ్మవారు

సామర్లకోట: నీలమ్మ చెరువు వద్ద ఉన్న నీలమ్మ తల్లి ఆలయంలో ఈ నెల ఐదో తేదీ నుంచి జాతర ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ నాయకులు తెలిపారు. నీలమ్మ చెరువు తవ్వకం చేస్తున్న సమయంలో సుమారు 130 ఏళ్ల క్రితం చిన్న రాతి విగ్రహం బయట పడింది. దాంతో ఆ అమ్మవారిని నీలమ్మగా గుర్తించడంతో, చెరువుకు నీలమ్మ చెరువుగా పేరొచ్చింది. ఆ రాతి విగ్రహానికి చిన్న గుడి కట్టించి, నిత్యం ధూపదీప నైవేద్యాలు సమర్పిస్తున్నారు. ఏటా జూన్ మాసంలో ఉత్సవాలు నిర్వహించడం అనవాయితీగా మారింది. అమ్మవారి జాతరలో సిరి బొమ్మ ఊరేగింపు సమయంలో చిరు జల్లులు కురియడంతో ప్రారంభమవుతుందని నిర్వాహకులు చెప్పారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే జాతరలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. జూన్ ఐదు నుంచి మూడు రోజుల పాటు జాతర ఉత్సవాలు జరుగుతాయి.

రేపు నేరెళ్లమ్మతల్లి జాతర


నేరెళ్లమ్మతల్లి

కొత్తపల్లి: మండలంలో కొమరగిరి గ్రామదేవత నేరెళ్లమ్మతల్లి జాతరను బుధవారం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. జాతర సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలు, వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. 6న అమ్మవారి తీర్థం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

వేసవి విజ్ఞాన శిబిరాలను వినియోగించుకోవాలి


ఉప్పాడలో తాము వేసిన బొమ్మలు చూపుతున్న విద్యార్థులు

కొత్తపల్లి: గంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి టి.నళినీ ప్రియ సూచించారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా ఉప్పాడ శాఖా గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు మ్యాథ్స్, స్పోకెన్ ఇంగ్లిషు, చిత్రలేఖనం, కథలు చెప్పడం తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు.

రేపు చిత్రలేఖన పోటీలు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్ తదితరులు

పెద్దాపురం: పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ) ఆధ్వర్యంలో ఈ నెల ఐదో తేదీన పర్యావరణంపై చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్టు పీసీసీ గౌరవాధ్యక్షుడు బుద్ధా శ్రీనివాస్ తెలిపారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో సోమవారం చిత్రలేఖన పోటీల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సబ్ జూనియర్స్ విభాగంలో 3,4, 5 తరగతులు, జూనియర్స్ విభాగంలో 6,7, సీనియర్స్ విభాగంలో 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. ఐదో తేదీ మధ్యాహ్నం మూడు గంటల నుంచి పోటీలు ఉంటాయన్నారు. ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

బుచ్చిబాబును పరామర్శించిన నాగబాబు

కొత్తపల్లి: పితృ వియోగంతో బాధపడుతున్న సినీ డైరెక్టర్ సానా బుచ్చిబాబును సోమవారం జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొణిదెల నాగబాబు పరామర్శించారు. బుచ్చిబాబు తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో కొత్తపల్లిలో సానా బుచ్చిబాబును జనసేన నేత కొణిదెల నాగబాబు పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో జనసేన పార్టీ నాయకులు జ్యోతుల శ్రీనివాస్, మరిశెట్టి సత్తిబాబు, సానా నాగు, మచ్చ అప్పాజీ, గుండ్ర అప్పారావు తదితరులు ఉన్నారు.

కౌంటింగ్‌కు సర్వం సిద్ధం


పిఠాపురంలో మోహరించిన పోలీసులు


కౌంటింగ్ హాలులో సిబ్బందికి సూచనలిస్తున్న ఈఆర్వో

- నేడే సార్వత్రిక ఎన్నికల తుది తీర్పు
- పిఠాపురం సెగ్మెంట్‌కు 18 రౌండ్లలో ఓట్ల లెక్కింపు
- 250 మంది సిబ్బంది నియామకం
- గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్న అభ్యర్థులు
- సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి

పిఠాపురం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు సర్వం సిద్ధమైంది. ఎమ్మెల్యే అభ్యర్థులు, పార్టీల నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న తుది తీర్పు వెలువడే క్షణాలు రానే వచ్చేసాయి. మంగళవారం పిఠాపురం నియోజకవర్గ ఓట్లు లెక్కింపు నిర్వహించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే కాకినాడ జిల్లా జేసీ, పిఠాపురం నియోజకవర్గ ఆర్‌ఓ రామ్‌సుందరరెడ్డి ఆధ్వర్యంలో కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేయగా ఆయన సోమవారం కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.

జేఎన్‌టీయూకేలో...

జేఎన్‌టీయూకేలో మంగళవారం పిఠాపురం నియోజకవర్గం ఓట్ల కౌంటింగ్‌ను 18 రౌండ్లలో లెక్కించనున్నారు. ఈ మేరకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. మొత్తం 11 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా 14 టేబుళ్లు, 18 రౌండ్లలో కౌంటింగ్ నిర్వహించనున్నారు. 154 మంది కౌంటింగ్ సిబ్బందితో పాటు ఆర్‌ఓ, ఏఆర్‌ఓ, ఎంపీడీఓలు తహసీల్దార్లు, పోలీసులు తదితర సిబ్బంది మొత్తం 250 మంది కౌంటింగ్ ప్రక్రియలో విధులు నిర్వహించనున్నారు.

ఏజెంట్లు సిద్ధం

కౌంటింగ్‌లో పాల్గొనడానికి అన్ని రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు తమ ఏజెంట్లను సిద్ధం చేసుకున్నారు. ఇప్పటికే ఆయా రాజకీయ పార్టీల నేతలు తమ ఏజెంట్లకు శిక్షణ పూర్తి చేశారు. కౌంటింగ్ ప్రక్రియపై ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన ఆంక్షలు విధించడంతో ఫలితాలు ఎప్పటికప్పుడు బయటకు రాకుండా కేవలం ఎన్నికల సంఘం ద్వారా మాత్రమే బయటకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఏజెంట్లు, మీడియాతో సహా ఎవరి వద్ద కూడా సెల్‌ఫోన్లు సైతం లేకుండా చర్యలు తీసుకున్నారు.

ఎవరికివారే గెలుపుపై ధీమా

గెలుపు మాదే అంటూ అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నా చివరికి ఏమి జరుగుతుందో అనే భయం అభ్యర్థుల్లో కనిపిస్తోంది. ఎవరికి వారే గెలుపు తమదే అంటు ధీమా వ్యక్తం చేస్తున్నారు. పిఠాపురం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత గెలుపు తనదే అంటూ పోలింగ్ పూర్తయిన నాటి నుంచి ధీమా వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఐదేళ్లలో చేసిన సంక్షేమం, అభివృద్ధి పేదలకు నేరుగా అందడంతో పాటు, అవినీతి రహిత పాలన తనను గెలిపిస్తాయని ఆమె చెబుతున్నారు. ముఖ్యంగా పిఠాపురంలో వైఎస్సార్ సీపీ, జనసేన పార్టీల మధ్యే పోటీ ఉండడంతో ఇరు పార్టీల నేతలు ధీమాగానే ఉన్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లతో తాము గెలుస్తున్నామని జనసేన నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

పోలీసులు అప్రమత్తం

ఎన్నికల ఫలితాల నేపథ్యంలో అల్లర్లు జరిగే అవకాశం ఉందని ఇంటిలిజెన్స్ హెచ్చరికల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే గత వారం రోజుల నుంచి గ్రామాలను జల్లెడపడుతున్న పోలీసులు సమస్యాత్మక గ్రామాలపై ఎక్కువ దృష్టి పెట్టారు. ఏఎస్పీ ఎస్పీ రామ్మోహన్ ఆధ్వర్యంలో ట్రైనీ డీఎస్పీ ప్రమోద్ మాక్‌డ్రిల్ నిర్వహించారు. వివిధ పార్టీల నాయకులతో అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. ఇప్పటివరకూ ఎన్నికల కోడ్ ఉల్లంగించిన వారిపై కేసులు నమోదు చేశారు.

18 సమస్యాత్మక గ్రామాలు

పిఠాపురం నియోజకవర్గంలో 18 సమస్యాత్మక గ్రామాలను గుర్తించారు. ఇప్పటికే 506 మందికి 143 నోటీసులు జారీ చేశారు. అలాగే 107 మందిపై బైండోవర్ కేసులు పెట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల 6వ తేదీ వరకూ గ్రామాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని పోలీసులు లౌడ్ స్పీకర్ల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నారు. బాణసంచా కాల్పులపైనా నిషేధం విధించారు. జనం గుమికూడటం, సంబరాలు చేసుకోవడం , సభలు, సమావేశాలు నిషేధమన్నారు. పిఠాపురం నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి పెట్టిన పోలీసులు భారీగా స్థానిక పోలీసులతో పాటు కేంద్ర బలగాలను మోహరించారు. సమస్యాత్మక గ్రామాల్లో ఎవరూ బయట తిరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. నియోజకవర్గాని వచ్చే అన్ని దారుల్లోనూ చెక్ పోస్టులు ఏర్పాటు చేసి వాహనాల తనిఖీలు చేపట్టారు. బైక్ ర్యాలీలపై నిషేధం విధించిన పోలీసులు ఇప్పటికే వాహన తనిఖీల పేరుతో అనధికారికంగా తిరిగే వందల వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ముఖ్యంగా మైనర్లు తిరిగే మోటారు సైకిళ్లపై దృష్టి పెట్టిన పోలీసులు ప్రత్యేక నాకాబందీ నిర్వహించి రికార్డులు లేని మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్లకు తరలించారు.

నేటితో ఉత్కంఠకు తెర

- ఓట్ల లెక్కింపు పైనే అందరి దృష్టి
- 15 రౌండ్లలో నియోజకవర్గ కౌంటింగ్

సామర్లకోట: గత నెల 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మంగళవారం జరిగే కౌంటింగ్‌తో 22 రోజుల టెన్షన్‌కు తెరపడనుంది. కాకినాడ జేఎన్‌టీయూలో కౌంటింగ్ ప్రక్రియ జరుగుతుంది. ఈ మేరకు పెద్దాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు 15 రౌండ్లలో జరగనుంది. కౌంటింగ్‌కు సంబంధించి ఎన్నికల కమిషన్ గతంలో ఎన్నడూ లేని విధంగా కఠిన నిబంధనలు అమలు చేస్తోంది. ఉదయం 7 గంటల్లోపు సిబ్బంది జేఎన్‌టీయూ కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలి. ఏడు దాటాక గేట్లు మూసివేసి ఎవరినీ లోనికి అనుమతించరు. మీడియాకు సంబంధించి గతంలో కౌంటింగ్‌కు ప్రతి నియోజకవర్గం నుంచి పేపరు నుంచి ఒకరు, చానల్ నుంచి ఒకరికి అనుమతి ఉండేది. ప్రస్తుతం జిల్లా నుంచి మాత్రమే ప్రతి పేపరుకు ఇద్దరు, చానల్‌కు ఇద్దరికి అనుమతిస్తూ పాస్‌లు మంజూరు చేశారు. ఆ పాస్‌లను కూడా క్షుణంగా పరిశీలించిన తర్వాతే భద్రతా సిబ్బంది కాకినాడ జేఎన్‌టీయూ కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతిస్తారు.

విజయోత్సవాలపై ఆంక్షలు

పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు మధ్యాహ్నం ఒంటి గంట సమయానికే పెద్దాపురం ఎమ్మెల్యే అభ్యర్థి ఫలితం తెలిసే అవకాశం ఉంది. విజయం సాధించిన అభ్యర్థి విజయోత్సవాలపై కూడా ఎన్నికల కమిషన్ ఆంక్షలు విధించింది. ప్రస్తుతం ప్రతి వేడుకలోను బాణసంచా కాల్పులు పరిపాటిగా మారింది. అయితే ఎన్నికల విజయోత్సవాల్లో బాణసంచా కాల్పులపై కఠినమైన నిబంధనలు విధించారు. విజయోత్సవాల్లో బాణసంచా కాల్పులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. అంతటితో ఆగకుండా విజయోత్సవాల్లో వినియోగించిన బాణసంచా ఎవరి వద్ద కొనుగోలు చేశారో తెలుసుకొని, వాటిని విక్రయించిన వారిపైనా చర్యలు తీసుకునేలా ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది.


సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ కేంద్రమైన కాకినాడ జేఎన్‌టీయూ

ఓటింగ్ తీరిలా..

పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో 201 పోలింగ్ బూత్‌ల్లోను ఉదయం ఏడు నుంచి ప్రతి పోలింగ్ బూత్‌లోను ఓటర్లు బారులు తీరారు. కొన్ని బూత్‌ల్లో రాత్రి 11 గంటల వరకు క్యూలో వేచి ఉండి ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్న విషయం విదితమే. నియోజకవర్గంలో 2,15,095 మంది ఓటర్లుండగా, వీరిలో 1,09,294 మంది మహిళలు, 1,05,788 మంది పురుషులు, 13 మంది ఇతరులు ఉన్నారు. నియోజకవర్గంలో 1,76,993 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా. 82.29 శాతం పోలింగ్ నమోదైంది. 88,895 మంది మహిళలు, 88,090 మంది పురుషులు, ఇతరులు 8 మంది ఓట్లు వేశారు.

ఫిల్టర్ ప్లాంటును పరిశీలించిన జేఎన్‌టీయూకే బృందం


సామర్లకోట ఫిల్టర్ బెడ్ ప్లాంటును పరిశీలిస్తున్న జేఎన్‌టీయూకే ప్రొఫెసర్లు

సామర్లకోట: ఉండూరు రైల్వే గేటు వద్ద ఉన్న ఫిల్టరు బెడ్ ప్లాంటును కాకినాడ జేఎన్‌టీయూ ప్రొఫెసర్లు సోమవారం పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ జె.రామారావు సూచనల మేరకు ప్రొఫెసర్లు కేవీవీ మురళీకృష్ణ, శ్రీనివాసులు ఫిల్టర్ బెడ్ చెరువు, ఫిల్టరు ప్లాంటులో నీరు శుద్ధి అవుతున్న విధానాన్ని పరిశీలించారు. ప్లాంటు సిబ్బందికి వారు కొన్ని సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఫిల్టరు చెరువులో నీటి మట్టం తగ్గిపోవడం, నీటి ప్రవాహం లేకపోవడం వలన చెరువులో నాచు పెరిగి పోయిందన్నారు. చెరువులో నీటిని శుద్ధి చేసే సమయంలో అవసరమైన మేరకు మాత్రమే క్లోరిన్, ఆలం కలపాల్సి ఉందన్నారు. ప్రజలకు తాగునీరు సరఫరా చేసే సమయంలో ఫిల్టరు నీటితో పాటు, బోరు నీరు కలిపి సరఫరా చేయడం ఉత్తమమని తెలిపారు. ఫిల్టరు చెరువులో శుద్ధి అవుతున్న నీటిని, బోరు నీటి శ్యాంపిల్లు తీసుకుని ల్యాబ్‌లో పరీక్షలు చేస్తామని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు గిడుతూరి శ్రీనివాసు తదితరులు ఉన్నారు.

మీడియా సెంటర్‌ను పరిశీలించిన కలెక్టర్


మీడియా సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ నివాస్

కాకినాడ సిటీ: ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి కాకినాడ జేఎన్‌టీయూ కంప్యూటర్ సైన్స్ పీజీ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమాచార కేంద్రాన్ని సోమవారం రాత్రి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఏర్పాట్ల వివరాలను ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నివాస్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియ సంబంధించి ఈ మీడియా సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మీడియా ప్రతినిధులకు అవసరమైన హైస్పీడ్ నెట్, టీవీలు, భోజనం, తాగునీరు, ఇతర అన్ని సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. అదే విధంగా మీడియా ప్రతినిధులు కౌంటింగ్ ప్రక్రియ విజువల్స్ తీసుకునేందుకు ఆయా నియోజకవర్గాల కౌంటింగ్ కేంద్రాలకు ప్రత్యేక వాహనాల్లో తీసుకెళతారని, ఇందుకు తగిన విధంగా వాహనాలు ఏర్పాటు చేసినట్టు వివరించారు. రౌండ్ల వారీ ఎన్నికల ఫలితాలు మీడియా సమాచార కేంద్రం ద్వారా విడుదల చేస్తారని తెలిపారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కార్పొరేషన్ ఏడీసీ సీహెచ్ నాగనరసింహారావు, డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎం శ్రీనివాసు, డీపీఆర్వో డి నాగార్జున, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సి.బాబూరావు, పౌర సరఫరాల డీఎం బాల సరస్వతి, డివిజనల్ పౌర సరఫరాల అధికారి పి.రవి ఉన్నారు.

సిబ్బంది సమన్వయంతో పని చేయాలి

కాకినాడ సిటీ: సాధారణ ఎన్నికల్లో భాగంగా సోమవారం కాకినాడ జేఎన్‌టీయూలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీలో పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గ కౌంటింగ్ అబ్జర్వర్‌గా నియమితులైన డాక్టర్ మేజర్ విశాల్ శర్మ, జాయింట్ కలెక్టర్ పిఠాపురం ఆర్‌ఓ ఎస్ రామ్‌సుందర్ రెడ్డితో కలిసి ఈవీఎంల స్ట్రాంగ్ రూము, కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గానికి కేటాయించిన కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లతో సమావేశం నిర్వహించారు. కౌంటింగ్ ప్రక్రియలో అనుసరించాల్సిన విధానాన్ని వివరించారు. ఆర్‌ఓ రామ్‌సుందర్‌రెడ్డి మాట్లాడుతూ మంగళవారం జరిగే ఓట్ల లెక్కింపు కార్యక్రమానికి ఉదయం 6 గంటలకే కౌంటింగ్ సెంటర్‌కు చేరుకోవాలన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ అంతా సజావుగా జరిగేందుకు కౌంటింగ్ సిబ్బంది కృషి చేయాలన్నారు. కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లు సమన్వయంతో పని చేయాలన్నారు. ఏజెంట్లు, అభ్యర్థులకు ఎటువంటి సందేహం లేకుండా, పూర్తి పారదర్శకంగా ఓట్ల లెక్కింపు నిర్వహించాలని సూచించారు.

సందట్లో సడేమియా..

- ఎన్నికల విధుల్లో అధికారులు
- విచ్చలవిడిగా మట్టి తవ్వకాలు


కట్టమూరు రోడ్డులో మట్టి తవ్వకాలు జరుపుతున్న జేసీబీ

పెద్దాపురం: రెవెన్యూ యంత్రాంగమంతా ఎన్నికల విధుల్లో ఉండగా, మట్టి అక్రమ తవ్వకందార్లు మాత్రం సందట్లో సడేమియా అన్నట్టుగా పెద్దాపురం మండలంలోని మెట్ట గ్రామాల్లో మట్టి తవ్వకాలను విచ్చలవిడిగా చేసేస్తున్నారు. రైతు పంట పేరుతో ఒకచోట, రోడ్డు అభివృద్ధి పేరుతో మరో గ్రామంలో మట్టి తవ్వకందార్లు పేట్రేగిపోతున్నారు. ప్రధానంగా మండలంలోని రాయభూపాలపట్నం, ఆర్‌బీ కొత్తూరు గ్రామాల్లో రేయింబవళ్లు వర్షాన్ని సైతం లెక్క చేయకుండా మట్టి తవ్వకాలు కొనసాగిస్తున్నారు. ఇలాఉంటే కట్టమూరు-కాండ్రకోట రహదారి అభివృద్ధి పేరుతో రహదారిలో సుమారు 14 ట్రాక్టర్లతో రెండు పొక్లెయిన్ల ద్వారా గంగాధర్ అనే వ్యక్తి మట్టి తవ్వకాలు జరుపుతున్నాడు. దీనిపై రెవెన్యూ, పంచాయతీ అధికారులకు సమాచారం అందినా పట్టనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసలే రహదారి అధ్వానంగా, గోతులమయంగా ఉండే కాండ్రకోట రోడ్డులో నిత్యం మట్టి ట్రాక్టర్లు ప్రయాణించడంతో, ఆ రహదారి బురదమయంగా మారింది. వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అక్రమ మట్టి తవ్వకందార్లపై సంబధిత ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఉప్పాడ-పిఠాపురం రోడ్డులో ఆక్రమణలు


పిఠాపురం-ఉప్పాడ రోడ్డులో కాలువను ఆక్రమించి చేపట్టిన అక్రమ కట్టడాలు


పూడుకుపోయిన కాలువ

కొత్తపల్లి: ఉప్పాడ-పిఠాపురం రోడ్డులోని ప్రధాన కాలువను కొత్తపల్లి శివారు రవీంద్రపురంలో కొందరు ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. రోడ్డును సైతం ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంటలు ముంపునకు గురైనప్పుడు, ముంపు, మురుగు నీరు ఉప్పాడ మీదుగా సముద్రంలోకి కలిసేందుకు ఇది ఒక ప్రధాన కాలువ. ఈ కాలువను ఎక్కకక్కడ ఆక్రమించి నిర్మాణాలను చేపట్టడంతో పూర్తిగా పూడుకుపోయింది. దీంతో మురుగు, ముంపు నీరు వెళ్లేందుకు మార్గం లేక రవీంద్రపురం కాలనీలో రోడ్లపై నిలిచిపోతోంది. మురుగునీరులో ప్రయాణించేందుకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ కాలువ కొత్తపల్లి నుంచి ఉప్పాడ మీదుగా కొత్తపట్నం వద్ద సముద్రంలో కలుస్తుంది. భవనాలు, షాపులను నిర్మించడంతో కనీసం నీరు పోయేందుకు తూరలు కూడా ఏర్పాటు చేయకుండా పూర్తిగా మూసివేశారు. కాలువలను ఆక్రమించే వారి నుంచి మామూళ్లు పుచ్చుకోవడం లేదని ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కొబ్బరి బొండం.. అమృత భాండం

- ఇటీవల కాలంలో ఎనలేని గిరాకీ
- రూ.30కి విక్రయం
- లీటరు నీళ్లు రూ.వంద


సామర్లకోట రైల్వే గేటు సమీపంలో కొబ్బరి బొండాలు విక్రయిస్తున్న కనకదుర్గాదేవి


నీళ్ల కాయలు దింపి వేయడంతో బోసిగా ఉన్న కొబ్బరి చెట్లు

సామర్లకోట: కొబ్బరి నీళ్లు శరీరానికి శ్రేయస్కరమని వైద్య నిపుణులు చెబుతుండడంతో, కొబ్బరి బొండాలకు గిరాకీ పెరిగింది. కొబ్బరి బొండాలను అమృత భాండాలుగా చెబుతుంటారు. వైద్యులు కూడా రోగులకు కొబ్బరి నీళ్ల తాగాలని సూచిస్తుంటారు. కొబ్బరి కాయలను సుమారు 60 ఏళ్ల క్రితం వరకూ ఆలయాల్లో నైవేద్యం కోసమే వినియోగించేవారు. ఆ కొబ్బరి కాయలో వచ్చిన నీటిని తాగేవారు. క్రమేపీ కొబ్బరి నీళ్లకు ప్రాధాన్యం ఏర్పడడంతో, కొబ్బరి బొండాలను తాగే వారి సంఖ్య గణనీయంగా పెరిగిపోయింది.

పెరిగిన వ్యాపారులు

పట్టణ పరిధిలో కొబ్బరి బొండాలు విక్రయించే వ్యాపారుల సంఖ్య కూడా పెరిగింది. పట్టణ పరిధిలో సుమారు 20 మంది కొబ్బరి బొండాలను విక్రయిస్తున్నారు. కొంత మంది తోపుడు బండ్లపై, సైకిళ్లపై వీధుల్లో తిరుగుతూ బొండాలను అమ్ముతున్నారు. ప్రజల అవసరాల మేరకు కొబ్బరి వ్యాపారులు చెట్ల నుంచి లేత కాయలను గెలలతో దింపి వేయడంతో కాపు తగ్గిపోతుందనే వాదనలూ లేకపోలేదు. గతేడాది రూ.20 ఉన్న కొబ్బరి బొండాం ప్రస్తుత మార్కెట్‌లో డిమాండ్‌ను బట్టి రూ.30కి చేరింది. వేసవిలో ఎండలు ఎక్కువగా ఉండటంతో రోడ్డు మార్జిన్‌లో కొబ్బరి బొండాలు విక్రయించే వారు ఎక్కువయ్యారు. ప్రయాణికులు తమ వాహనాలు నిలుపుదల చేసి, వీరి వద్ద కొబ్బరి బొండాలు కొనుగోలు చేస్తున్నారు.

ఏలూరు నుంచి రవాణా

కాకినాడ జిల్లా పరిధిలో కొబ్బరి బొండాల కొరత ఏర్పడడంతో, మేక కనదుర్గాదేవి అనే మహిళా వ్యాపారి ఏలూరు నుంచి కొబ్బరి బొండాలను ఇక్కడకు రప్పించి, విక్రయిస్తోంది. భర్త చనిపోవడంతో కుటుంబ పోషణ కోసం ఆమె స్థానిక రైల్వే గేటు సమీపంలో రోడ్డు మార్జిన్‌లో మూడేళ్లుగా కొబ్బరి బొండాలను విక్రయిస్తోంది. ఏలూరు నుంచి రవాణా చార్జీలతో కలిపి కొబ్బరి బొండం రూ.27 పడుతుందని, దానిని రూ.30కి విక్రయిస్తున్నట్టు ఆమె వివరించింది. లీటర్ బాటిల్ రూ.100కు విక్రయిస్తున్నట్టు పేర్కొంది. సీసాలో నాలుగు నుంచి ఐదు బొండాలు పడితే నష్టం వస్తుందని, అయినా భరిస్తూ వ్యాపారం చేస్తున్నామని చెప్పింది. రోజుకు 100 బొండాల వరకు విక్రయిస్తామని వెల్లడించింది.

పర్యావరణ పరిరక్షణకు సమష్టి కృషి


స్నాప్ సొసైటీ ఆధ్వర్యంలో మొక్కలు నాటుతున్న సభ్యులు

కాకినాడ సిటీ: వాతావరణ సమతుల్యానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏపీ బయోడైవర్సిటీ బోర్డు రీజనల్ కో-ఆర్డినేటర్ సత్యప్రసాద్ కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈ నెల ఐదున కాకినాడ జిల్లాలో పలు ప్రాంతాల్లో స్నాప్ (ప్రకృతి, జంతు సంరక్షణ) సొసైటీ ఆధ్వర్యంలో కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఏ, బీ, సీ ప్రాజెక్టుల సెంటర్లలో మొక్కలు నాటినట్టు వివరించారు. ప్రస్తుతం వాతావరణం సమతుల్యత కోల్పోయిందని, దాని వల్ల ప్రజల జీవన ప్రమాణాలు నష్టపోవాల్సి వస్తోందని సత్యప్రసాద్ ఆందోళన వ్యక్తం చేశారు. స్నాప్ సొసైటీ అధ్యక్షుడు, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్, యానిమల్ బర్త్ కంట్రోల్ కో-ఆర్డినేటర్ శ్యామ్ మాట్లాడుతూ ప్లాస్టిక్ అధికంగా వినియోగించడం వల్ల కూడా పర్యావరణ కాలుష్యం, వాతావరణ మార్పులు ఏర్పడి సమస్యలు తలెత్తుతాయని వివరించారు. ప్రతి ఒక్కరూ వారి పరిధిలో మొక్కలు నాటాలని కోరారు.